
# దొంగ దొరికింది

## ఉషారాణి భాటియా



రాత్రి ఎనిమిదిన్నర అవుతుంది. లలిత కిటికీ లోంచి బైటికి చూస్తోంది. దూరంగా మిణుకు మిణుకు మంటున్న దీపాలు తప్ప బైటంతా చీకటిగా, నిర్మానుష్యంగా ఉంది. కిటికీ తలుపులు ఓరగా వేసింది లలిత. బల్ల దగ్గిరకెళ్లి కాయితాలు సర్దసాగింది. చిన్న గది. దాన్ని ఆనుకుని స్నానాల గది. రెండు మంచాలు, కుర్చీలు, చిన్న స్టూలు మీద కూజా, నీళ్లు - గదిలో ఆట్టే వెలుతురు లేదు.

లలిత ఆ గదిలో ప్రవేశించి ఇంకా, రెండు రోజులయినా కాలేదు. కానీ మనసు ఎలాగో ఒంటరిగా అనిపించింది. ఉదయం 9 గం॥ ప్రారంభమయే గోష్ఠి ప్రసంగాలు సాయంకాలం 5 గం॥ కి పూర్తవుతాయి.

కావలసినంత సందడి, గోష్ఠిలో పాల్గొనేందుకు వచ్చిన స్త్రీల నవ్వులతో ఖబుర్లతో - హాస్టలు కళకళలాడుతోంది. కానీ లలితకి ఇల్లు వదిలి వచ్చి అప్పుడే నెల అయినట్లు ఉంది. పుట్టి పెరిగిన వూరు కాకినాడ లోనే లలిత టీచరుగా వుద్యోగం చేస్తూంది. ఢిల్లీలో గోష్ఠి, దూర ప్రాంతాల నుంచి వచ్చే టీచర్ల సమావేశం, చర్చలు అనగానే సంబరపడి బయలుదేరింది. కానీ ఆ హాస్టలు, భోజనం, చల్ల గాలి - లలితకి కొత్తగా వున్నాయి.

గోష్ఠి తాలూకు కాయితాలు, పుస్తకాలు కాస్సేపు తిరగేసి మంచం మీద ఓరగా పడుకుంది లలిత.

ఇంతలో ధభాలున తలుపుతోసుకుని ఇద్దరమ్మాయిలు గదిలోపలికి వచ్చారు.

"మాడమ్! మాకో సహాయం కావాలి. ఈ గదిలో మూడో మంచం వేసేందుకు చోటు వుంది కదండీ? ఈ మూలగా మరో మంచం వేస్తున్నాము. మీకు అభ్యంతరం లేదనుకుంటాము..." వాళ్ల మాటలు పూర్తవకుండానే మరో ఇద్దరమ్మాయిలు ఒక మంచాన్ని లోపలికి తీసుకు వచ్చారు. దాని మీద పరుపు అదీ వేసి, సర్దారు.

"నా గదిలో మరో ఆమె వున్నారు.మిసెస్. పంకజం. ఆమెని కూడా ఒకసారి..." లలిత ధైర్యం చేసుకుని నెమ్మదిగా అంది. "చూడండి మాడమ్. ఇది తప్పని సరిగా చేయవలసి వచ్చింది. ఈమెకి వయసు మళ్లింది. మెట్లెక్కలేదు. అందుకని కిందనే ఏర్పాటు చేయవలసి వచ్చింది. మిగతా గదులన్నీ నిండి పోయాయి."

అమ్మాయిలు గలగలమంటూ మాట్లాడి, లలిత అంగీకారంతో ప్రమేయం లేనట్లు వెళ్లిపోయారు. గది తలుపులు ఇంకా తెరచుకునే వున్నాయి. బైట చీకటిగా వుంది. పొట్టిగా, నల్లగా, తెల్లచీర కట్టుకుని, చేతిలో ఒక గుడ్డ సంచీ పట్టుకుని ఒక స్త్రీ లోపలికి ప్రవేశించింది. ఆమెకి యాభై ఏళ్లుంటాయి. తల ఒంచి లలితకి నమస్కారం చేసింది. అడుగులు తడబడుతూ మూడో మంచం వైపు వెళ్లింది. సంచీ పక్కన పెట్టి, కాళ్లు పైకి తీసుకుని మంచం మీద కూర్చుంది. లలితతో మాటలు కలిపేందుకు ఆమె ప్రయత్నించ లేదు. తను ఎవరో, ఎక్కణ్ణుంచి వచ్చిందో చెప్పలేదు. చూసేందుకు కొంచెం మోటుగా, ఆట్టే చదువు సంధ్యలు లేని సామాన్య స్త్రీలా వుంది. రూపాన్ని బట్టి దారిద్ర్యము, దైన్యము స్ఫురిస్తాయేగానీ ఆమె వృత్తి, ప్రాంతం మొదలైనవి ఊహించటం కష్టం. "గోష్ఠికి వచ్చారా?" అడిగింది లలిత కంఠం సర్దుకుని. అవునన్నట్లు ఆమె తల వూపి నవ్వి గోడవైపు తిరిగి పడుకుంది.

ఇంతలో మళ్లీ గభాలున తలుపు తెరచుకుంది. పంకజం తుఫానులా లోపలికి ప్రవేశించింది.

"ఏమిటి ఇంత నిశ్శబ్దంగా వుంది గది? అప్పుడే నిద్రపోతున్నావా?" అంటూ పెద్ద దీపం వేసింది. ఆ కొత్త వెలుతురులో పంకజం కళ్లు మూడో మంచం, మీద పడ్డాయి. కళ్లు చిట్లించి "ఎవరీ మనిషి?" అనడిగింది గట్టిగా గొంతుకు ఆర్చుకుపోతుంటే, "నాకు తెలియదు. హాస్టలు వార్డను పంపారు" అంది లలిత దోషిలా. పంకజం ముఖంలో కోపం, నిరసన చోటు చేసుకున్నాయి. ఆమె మళ్లీ ఏదో అనబోయేముందు లలిత ఆమెని వరండాలోకి తీసుకెళ్లింది. జరిగినదంతా వివరించింది.

"ఇది చాలా అన్యాయం. ఆమె ఎవరో మనకి తెలియదు. ఇద్దరికని కేటాయించిన గదిలో మూడో

మనిషిని ఎలా బలవంతంగా ప్రవేశ పెట్టగలరు?"

లలిత! సంకోచంగానే అంది. "ఆమె మెట్లెక్క లేదుట. పోనీ సర్దుకుపోదాం."

"వార్డను ఈమెని · తన గదిలో పెట్టుకోవచ్చుగా. మన నెత్తిన దేనికి? · గది అసలే ఇరుకుగా వుంది" పంకజం చిరచిర లాడింది. కానీ ఆ రాత్రి ఏం చేయలేక ఇద్దరూ మౌనంగా గదిలోకి వెళ్లి పడుకున్నారు.

తెల్లవారింది. మూడో మంచం కిర్రుమంటూ శబ్దం చేసింది. ఆమె లేచి స్నానం చేసింది. మళ్లీ కమిలి పోయిన ఒక తెల్ల చీర కట్టుకుంది. సంచీ సర్దుకుని మంచం మీద ఓ మూలగా జాగ్రత్త చేసింది. గదిలోని పంకజం, లలితల వంక కుతూహలంగా చూడలేదు మాట్లాడేందుకు ప్రయత్నించనూ లేదు. నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ బైటికి వెళ్లిపోయింది.

"లలితా! నువ్వింకా చిన్నదానివి. అనుభవం తక్కువ. నేను బాగా ఎరుగుదును. ఈమెని గదిలోకి ప్రవేశించకుండా నువ్వు ముందే ఆపవలసింది." అంది పంకజం గంభీరంగా.

"ఎలా ఆపగలను? "అమాయకంగా అడిగింది లలిత.

"ఈ గదిలో మరో ఆమె కూడా వుంది. ఆమె అనుమతిస్తే గానీ మూడో మంచం వెయ్యవద్దు అని స్పష్టంగా చెప్పవలసింది" అంది పంకజం "ఎలా అనగలను? ఆమె మెట్లెక్కలేదు"

లలిత గొంతు బొంగురుపోయింది.

"అదే! అదే మీ చిన్నవాళ్లకి తెలియని లోకజ్ఞానం" అంటూ పంకజం కాస్సేపు మౌనంగా వుండి పోయింది. లలిత మనసు కలతగా వుంది. ఏదో రాకరాక ఇల్లు, తల్లితండ్రుల్ని వదిలి ఢిల్లీ వచ్చింది. నలుగుర్నీ కలుసుకుని, తనకంటె వయసులో పెద్దయిన తోటి స్త్రీలనుంచి ఏదో నేర్చుకోవాలని ఆశపడింది. కానీ ఈ ఆకస్మిక సంఘటనతో ఉత్సాహం సన్నగిల్లి, పంకజం అసంతృప్తికి కారకురాలయింది.

"అయితే ఇప్పుడేం చేద్దామంటారు" అనడిగింది పంకజాన్ని.

"ముందు మన సామాను, వస్తువులు జాగ్రత్తగా చూసుకోవాలి. పెట్టెలకి తాళం వేసే వుంచాలి. ఇద్దరి లో ఎవరో ఒకరం గదిలో వుండి తీరాలి అంటే మీరనేది ఆమె..." అడిగింది లలిత. ఆమె గుండె దడదడ కొట్టుకుంటోంది. ఢిల్లీ వస్తూ తీసుకొచ్చిన పట్టుచీరలు, డబ్బు జ్ఞాపకం వచ్చాయి. చీరల్లో చాలామటుకు అమ్మవి. డబ్బు స్నేహితులవి. ఢిల్లీలో అవీ ఇవీ పట్టుకు రమ్మని ఇచ్చారు. చీరలు, డబ్బు పోగొట్టుకుని తిరుగు ప్రయాణం లలిత ఊహించలేక పోయింది.

"మనిషిని చూసి పసిగట్టలేక పోయావా? క్లాసు ఫోరు - అదే పనివాళ్ల రకంలా వుంది. ఆమె మనలా టీచరు, గోష్ఠికి వచ్చిందంటే నమ్మశక్యంగా వుందా?" అడిగింది పంకజం. లలిత ఆలోచనలో పడింది. నిజమే. ఆమె వాలకం చూస్తే చదువుకున్న సంస్కార వతిలా లేదు. బీదరాలు. "అసలు ఈ గోష్ఠికి ఎలా వచ్చింది?" అడిగింది పంకజాన్ని.

ఈ రోజుల్లో దొంగతనాలు రకరకాలుగా జరుగు తున్నాయి. దొంగలు కూడా ఎన్నో వేషాలు వేసుకుంటు న్నారు. పత్రికలలో చదవటం లేదా? నిజం చెప్పొద్దూ నేను చాలా క్యాష్ తీసుకు వచ్చాను. నీ దగ్గిర కూడా వుండివుండాలి. మనం కొంచెం వున్న వాళ్లమని ఆమె ముందే తెలుసుకుని వుండాలి. అందుకే గదిలో జొరబడింది." పంకజం నిదానంగా అంది.

లలిత వెనక్కి తిరిగింది. తన వి.ఐ.పి. సూట్ కేసు వంక ఓసారి చూసుకుంది. బైట అటుయిటుగా పడివున్న కొన్ని వస్తువుల్ని చీరల్ని పెట్టెలో దోపి తాళం వేసింది. పర్సు కూడా సరిచూసుకుంది.

గంట తొమ్మిదయింది. ఇద్దరూ సమావేశ సభకి దారి తీశారు. హాలు జనంతో క్రిక్కిరిసి వుంది. వారి మధ్య తన గదిలో వున్న స్త్రీని గుర్తు పట్టింది లలిత. ఆమె సంచీ లోంచి కళ్లజోడు తీసి పెట్టుకుని నాలుగు వైపులా చూస్తోంది. చేతిలో ఏవో కాయితాలు వున్నాయి. గోష్ఠికి వచ్చిన పరిచితుల్ని కలుసుకుని లలిత పక్కన వచ్చి కూర్చుంది పంకజం.

"చూశారా? మనలాంటి వాళ్ల కళ్లు కప్పేందుకు ఏవో హిందీలో రాసిన కాయితాలు పట్టుకు కూర్చుంది" అంటూ లలిత భుజం తట్టి పంకజం గట్టిగా నవ్వింది. ముందు వరుసలో కూర్చున్న వారు వెనక్కి తిరిగి చూశారు. లలితకి ఏదో ఇబ్బందిగా అనిపించింది.

"మాది పెద్ద కుటుంబం నౌఖర్లూ, చాకర్లూ లేకుండా మాకు నిముషం గడవదు. పనివాళ్లు నోరు తెరిచి అడిగితే నేను సంతోషంగా ఇస్తాను. దొంగతనం చేశారా నాకు మహా చిర్రెత్తుతుంది. అసలు మోసం, దొంగతనం నేను భరించలేను." పంకజం చెప్పుకు పోతూంది. వేదిక మీద ప్రసంగాలు లలితకి వినపడటం లేదు.

"అయితే నాకొక సందేహం. ఆమెకి ఈ గోష్ఠిలో పాల్గొనే అవకాశం ఎలా కలిగింది? ఆహ్వానం ఎవరు పంపారు? ఈ సమావేశాలు నడిపేవారు ఇవన్నీ చూసుకుని జాగ్రత్త పడవద్దా?" అడిగింది లలిత గదికి తిరిగి వస్తూ.

"అదిగో అటు చూడు!" లలితని పట్టుకుని ఆపింది పంకజం. దూరంగా ఒక చెట్టు కింద కొంతమంది పనివాళ్లు, వారి కుటుంబం కూర్చుని వున్నారు. మూడో మంచం స్త్రీ వారి మధ్య నిలుచుని మాట్లాడుతూంది. ఆమెకి వారితో బాగా పరిచయమున్నట్లు వుంది. "చూశావా? వాలకం! ఈ గోష్ఠికి సంబంధించిన నౌఖరు ఒక ఆహ్వాన పత్రిక కాజేసి ఆమెకి అందించి వుంటాడు. గుంపులో గోవింద అని వచ్చింది. ఈ హడావుడిలో ఎవరెవరో చూసే వ్యవధి ఎవరికుంది? దొరికిన నాలుగు వస్తువులు సంచిలో వేసుకుపోతే ఎవరు కనిపెడతారు" - ఇవన్నీ అటుంచి మనకి ఒక అంతస్తు అదీ లేదా? తక్కువ తరగతి వాళ్లతో గదిలో కలిసి వుండవలసిన ఖర్మం మనకేం పట్టింది? ఊరెళ్లాక పత్రికలో ఘాటుగా రాసెయ్యాలి?" అంది పంకజం.

లలిత మనసంతా పాడయిపోయింది. ఏదో కలతగా వుంది. రేపు గోష్ఠి ఆఖరి రోజు మధ్యాహ్నానికి తిరుగు ప్రయాణం రాత్రికి జాగ్రత్తగా వుండాలి. ఏం జరిగినా ఆవేళ రాత్రి జరుగుతుంది. దొంగలు, దొంగ తనం గురించి లలిత అంత వరకు లోతుగా ఆలోచించి ఎరగదు. అసలు అటువంటి అవకాశం కలుగుతే కద! తన బస మరో చోటికి మారుద్దామా అంటే తనకి ఆ వూళ్లో ఎవరూ పరిచితులు లేరు. పంకజం, లలిత ఒక నిశ్చయానికి వచ్చారు. ఆ రాత్రి మెలకువగా వుండాలి. తమ వస్తువులు కాపాడు కునేందుకు మరో మార్గం లేదు.

గది తలుపులు తెరుస్తుంటే లలిత చేతులు వణికాయి. రాత్రి భోజనం త్వరగా ముగించుకుని ఇద్దరూ పడుకున్నారు. ఎందుకైనా మంచిదని, సామాన్లు వారివారి మంచాల కిందికి చేర్చారు.

ఆ రాత్రి మూడో మంచం మీది వ్యక్తి పడుకునే సరికి దాదాపు 11 గంటలయింది. ఆమె గదికి రావడమే ఆలస్యంగా వచ్చింది. లోపలికి వచ్చిన



* కొద్దిగా పాలల్లో కొన్ని మెంతుల్ని వదిహేను నిమిషాలు నానేసి మెత్తగా రుబ్బి ముఖానికి పట్టిస్తే ముఖం నునుపుదేలి మెరిసి పోతుంటుంది.

* వాడేసిన నిమ్మతొక్కల్ని పారేయకుండా ఫ్రిజ్‌లో వుంచితే చెడువాసన వదిలి సువాసన చేటు చేసుకుంటుంది.

10 నిమిషాలకి ఎవరో తలుపు తట్టారు. ఆమెని పిలిచారు. బైట • గుసగుసలు వినపడ్డాయి. లలిత, పంకజం చీకట్లో కళ్లు తెరుచుకునే పడుకున్నారు. ఆమె లోపలికివచ్చి పడుకునేంత వరకు వారి మనసుకి శాంతి లేదు.

తెల్లవారింది. ఆ రోజు ముగింపు సభ. లలిత, పంకజం తమ సామాన్లు తనిఖీ చేసుకుని, తాళాలు బిగించి, నిట్టూర్చారు. తరువాత మంచి చీరలు కట్టుకుని (ఆ వేళ గ్రూపు ఫోటో వుంది కదా మరి!) ముస్తాబయి, బయలుదేరారు. ఆమె స్నానం చేసి గదిలో ప్రవేశించింధి. అదే తెల్లని ముతకచీర, జిడ్డు ఓడుతున్న ముఖం, చేతిలో గుడ్డ సంచీ, "నా వల్ల మీకేం కష్టం కలగలేదనుకుంటాను" అంటూ లలితకీ పంకజానికీ ఒంగి నమస్కారం చేసింది. లలిత కొద్దిగా నవ్వినట్లు పెదిమలు కదిలించింది. పంకజం ముఖం తిప్పుకుంది.

"సేవక ప్రవృత్తి. ఆ ఒంగి నమస్కారం చేయటం చూడు" అంది ఏవగింపుగా.

సభ ఠంచనుగా తొమ్మిదింటికి ప్రారంభమయింది. జనం కిటకిటలాడుతున్నారు. లలిత, పంకజం మూడో వరుసలో కూర్చున్నారు. అధ్యక్ష ఉపన్యాసాలు, పరిచయాలు, అభినందనలు, వీడ్కోలు అయ్యాక - ముఖ్య అతిథి ఇలా అన్నారు.

"ఈ గోష్ఠి సందర్భాన్ని పురస్కరించుకుని మేము కొంత మంది ఉపాధ్యాయినుల్ని సన్మానిస్తున్నాము. ఉద్యోగ నిర్వహణలో ఉత్తమ ప్రమాణాలు, అంకురిత దీక్ష, సేవానిరతి ప్రదర్శించిన వీరు మీకు ఆదర్శ ప్రాయులు" అంటూ ఒక్కనిముషం ఆగి, "ఈమె ప్రత్యేకంగా పేర్కొన వలసిన ఉపాధ్యాయిని. బీహారు లోని ఆదివాసుల మధ్య నివసిస్తూ, వారిలో నిరక్ష రాస్యత నిర్మూలించేందుకు ఎంతో సేవ చేశారు. మితభాషి, నిగర్వి. ఈమె ఈ గోష్ఠికి వచ్చేందుకు మేము ఎంతో శ్రమపడ్డాము. ఆమె అంగీకరించి యిక్కడికి రావడమే మా అదృష్టమనాలి" ముఖ్య అతిధి ఏదో చెప్పుకుపోతున్నాడు. మూడో మంచం సొంతం చేసుకున్న స్త్రీ వేదికమీదికి వచ్చింది... నెమ్మదిగా అడుగులు వేస్తూ పులమాల వేస్తూండగా ఆమె ఒంగి నమస్కారం చేసింది. చిన్నగా నవ్వింది. లలిత, పంజకం కుర్చీల్లో బిగుసుకు పోయారు: పంకజం అయితే మరీను, దొరికిపోయిన దొంగలా వుందామె పరిస్థితి.

ఆ రోజు రైల్లో కాకినాడ తిరిగి వెళుతుంటే లలితకి ఎక్కడో చదివిన వాక్యాలు జ్ఞాపకం వచ్చాయి. "ప్రతి అనుభవం నుంచీ మనం కొంత నేర్చుకోవాలి. అను భవం వల్ల మనం ఒక మెట్టు పెరిగితేనే, అది బాధాపూరితమైనప్పటికీ, ఆత్మశిక్షణ అనేది కొంత అలవడుతుంది"